మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వానం

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నేరేడుచర్ల, మార్చి 19: మండలంలోని మేడారం గ్రామంలో ఏప్రిల్ 3న నిర్వహించే సీతారామ చంద్ర స్వామి, ఆంజనేయ స్వామి, ముత్యాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నేరేడుచర్ల మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డికి ఆహ్వాన పత్రికలను ఇచ్చారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అన్ని వర్గాలకు అన్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 19: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఎన్నికల హామీలకు, పేదల సంక్షేమానికి పాతరేసేలా ఉందని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు కొప్పుల సైదిరెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని కరక్కాయలగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కీత జయమ్మధనమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేపల్లి వీరబాబు, మండల రైతు సంఘం అధ్యక్షుడు చింతకుంట్ల శ్రీనివాస్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కీత కృష్ణమోహన్, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

- ఎండిన వరి చేనులో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నిరసన

జాజిరెడ్డిగూడెంలో ఎండిన పొలంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

అర్వపల్లి, మార్చి 19 : ఎండిన పంటలకు ఎకరానికి 25 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం జాజిరెడ్డిగూడెంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం ఎండిన వరి చేనులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ మాట్లాడుతూ అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి వరి సాగు చేసిన రైతులు పంటలు ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తమది రైతు ప్రభుత్వం అంటున్న రేవంత్‌రెడ్డి సర్కారు రైతుల సమస్యలను అర్థం చేసుకుని ఆదుకోవాలని కోరారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నల్లగుంట తీగలచెరువు, కేశవపురం చెరువులను నింపి మిగిలిని కొద్దపాటి పంటలకైనా నీళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ నాయకులు పోలెబోయిన లింగయ్య, గ్రామ కార్యదర్శి వాడకల బయన్న, కొమరయ్య, నర్సయ్య, సురేశ్ పాల్గొన్నారు.

యువతిపై ఇద్దరు యువకుల లైంగిక దాడి

హుజూర్‌నగర్, మార్చి 19: స్నేహం ముసుగులో ఇద్దరు యువకులు ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెర్వుకు చెందిన ఓ యువతికి హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన హరీశ్, ప్రమోద్ అనే ఇద్దరితో స్నేహం ఉంది. రోజా అనే యువతి సాయంతో మంగళవారం సదరు యువతికి బలవంతంగా మద్యం తాగించిన యువకులు ఆమెను కారులో పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలోకి తీసుకెళ్లారు. అక్కడే కారులో యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

కోదాడ రూరల్, మార్చి 19: మండల పరిధిలోని కాపుగల్లు క్రాస్‌రోడ్డు వద్ద కోదాడ, మేళ్లచెర్వు ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ కాపుగల్లు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దొంతగాని అప్పారావు అధ్వర్యంలో ఆర్అండ్‌బీ ఏఈ సత్యనారాయణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ క్రాస్‌రోడ్డు వద్ద అనేక ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని, అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బోసుబాబు, ఓర్సు గోపి, సతీశ్, కె.వీరబాబు, కె.నాగరాజు, సాయి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి'

మఠంపల్లి, మార్చి 19: మండలంలోని అన్ని గ్రామాల్లో అంతర్గత రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్, మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, నాయకులు ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, పొడిచెట్టి రాము, పి.జీవన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ వర్ధంతి సభ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నేరేడుచర్ల, మార్చి 19: నేరేడుచర్ల పట్టణంలో ఈ నెల 23న నిర్వహించే స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 94వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరుతూ పీవైఎల్, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో బుధవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకుడు వాస కరుణాకర్, మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి వాస పల్లయ్య, పేర్ల నాగయ్య, సయ్యద్ హుస్సేన్, అంబటి భిక్షం, సత్తెమ్మ, అరుణ్, నాగుల్, రజాక్, మరియమ్మ, కమలమ్మ, రంగయ్య, విన్నపరెడ్డి, ఫాతిమా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

డాక్యుమెంట్స్ పోయినవి
★G.V.L. ప్రసాద్ S/o. గూడ పిచ్చయ్య, R/o. H.No. 6-1-847, BJP ఆఫీస్ ప్రక్కన, నల్లగొండ. నాకు సంబంధించిన ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ (నెం. 6500/2000) నేను నల్లగొండలోని మా ఇంటి నుండి రామగిరికి ప్రయాణిస్తుండగా పోయినది. దొరికిన వారు సంప్ర|| 9966566708
NLG

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

త్రిపురారం :వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

త్రిపురారం, మార్చి 19: వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తాసీల్దార్ కార్యాలయం, కేజీబీవీని బుధవారం ఆమె తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపీ, స్టెరిలైజేషన్ రికార్డులను ఆమె పరిశీలించారు. ఓపీ సంఖ్య పెంచాలని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త బిల్డింగ్ మంజూరు చేయాలని సిబ్బంది కోరగా అందుకు ఆమె హామీ ఇచ్చారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టులను భర్తీ చేయాలని తాసీల్దార్‌ను ఆదేశించారు. కస్తూర్బా విద్యాలయంలో 8, 10 తరగతి విద్యార్థులకు కొద్దిసేపు పాఠాలు బోధించారు. అనంతరం పెద్దదేవులపల్లి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ కునిరెడ్డి విజయకుమారి, తాసీల్దార్ గాజుల ప్రమీల, కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యులు రమావత్ శంకర్, తిరునగరి ప్రియాంక, శిరీష, ఆర్ఐ గుండెబోయిన సైదులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌గాంధీ, కార్యదర్శి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

పంటల మార్పిడి చేపట్టాలి

చిట్యాల : భూగర్భ జలాలు తగ్గుతున్నందున రైతులు వచ్చే సీజన్ నుంచి రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బుధవారం ఆమె చిట్యాలలోని కొంతం సత్తిరెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి రైతు సాగు చేస్తున్న పంటల వివరాలను తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, జిల్లా ఉద్యానవన శాఖ ఇన్‌చార్జి అధికారి అనంతరెడ్డి, ఎంపీడీఓ ఎస్పీ జయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వీరేందర్, ఏఓ పగిడిమర్రి గిరిబాబు, డీటీ విజయ, హార్టికల్చర్ ఆఫీసర్ శ్వేత ఉన్నారు.

మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీకి 25న ఇంటర్వ్యూలు

నీలగిరి, మార్చి19 : నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బోధనా సిబ్బంది నియామకం ఈ నెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు ప్రొఫెసర్ పోస్టులు, 16 అసోసియేట్ ప్రొపెసర్లు, 15 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 12 సీనియర్ రెసిడెంట్, 13 ట్యూటర్లను కాంట్రాక్టు పద్ధతిలో నియమించనున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి గల వారు వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు https://nalgonda.telangana.gov.in, www.gmcnalgonda.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

త్రిపురారం, మార్చి 19: పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వై.ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.13,200 నగదు, మూడు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మానవ అక్రమ రవాణా నియంత్రణపై శిక్షణ

శాలిగౌరారం మార్చి 19 : మానవ అక్రమ రవాణా నియంత్రణపై మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం వీఏఎలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎం మోహన్‌రెడ్డి, ఎన్‌జీఏ అశ్రీత, జిల్లా కోఆర్డినేటర్ శోభారాణి, ఏపీఎం రాములు పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

మిర్యాలగూడ రూరల్, మార్చి19 : మండలంలోని టీక్యాతండాలో మూతపడిన తౌడు ఆయిల్ మిల్లు కార్యాలయంలో ఈ నెల 17న సామగ్రి చోరీ చేసిన వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. బుధవారం టీక్యాతండాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అదే గ్రామానికి చెందిన ధీరావత్ నిఖిల్‌ను పట్టుకొని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడని పేర్కొన్నారు.

సునీతా విలియమ్స్‌కు చిన్నారుల స్వాగతం

సునీతా విలియమ్స్ చిత్రపటాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మర్రిగూడ, మార్చి 19 : తొమ్మిది నెలల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉండి భూమి మీదికి తిరిగి వస్తున్న భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు స్వాగతం పలుకుతూ బుధవారం మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆమె చిత్ర పటాలను ప్రదర్శించారు. ఆమె వస్తున్న వ్యోమ నౌక సముద్రంలో ల్యాండ్ అయిన దృశ్యాలను ట్యాబ్ ద్వారా విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ, మార్చి 19: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భాగ్యనగర్ కాలనీకి చెందిన ముడావత్ నాగు(35), ప్రియ దంపతుల మధ్య కొంత కాలంగా మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. మంగళవారం సాయంత్రం ప్రియ తన కూతురిని ట్యూషన్ నుంచి ఇంటికి తీసుకొచ్చేందుకు వెళ్లింది. తిగిరి ఇంటికి వచ్చి చూసే సరికి నాగు చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. ఆమె స్థానికుల సాయంతో అతడిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే నాగు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ అతడి పంతులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

మిర్యాలగూడ రూరల్,మార్చి19 : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని జంకుతండా శివారు పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం చోటు చేసుకొంది. రూరల్ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంటాద్రిపాలెం గ్రామానికి చెందిన చింతపల్లి పవన్‌కళ్యాణ్(19), పూజ దుర్గయ్య గ్రామంలోని ఆర్ఎస్ గోదాంలో తాత్కాలిక ప్రాతి పదికన పని చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో వారిద్దరు గోదాం కాంపౌండ్ వెలుపల క్రికెట్ ఆడేందుకు గోదాం గోడ ఎక్కి దూకే క్రమంలో చెట్టుకొమ్మను పట్టుకొన్నారు. ఆ కొమ్మ కాంపౌండ్ పైభాగాన ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్‌కు తాకి ఉండడంతో వారు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయారు. పవన్ కళ్యాణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందగా, గాయపడిన దుర్గయ్యను స్థానికులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలి

- రైతుసంఘం నాయకులు

మాడ్గులపల్లి, మార్చి 19: ఏఎమ్మార్పీ వరద కాల్వ ద్వారా సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని దాచారం గ్రామంలో వరద కాల్వను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం వరద కాల్వ ద్వారా నీటిని అందించకపోవడంతో మండలంలోని దాచారం, నారాయణపురం, కన్నెకల్‌తోపాటు చాలా గ్రామాల్లో రైతులు సాగుచేసిన వందలాది ఎకరాల వరి పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే మరింత పంట ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆయన వెంట నాయకులు పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి మల్లారెడ్డి, వెంకటాచారి, జూకూరి నాగయ్య, దయాకర్‌రెడ్డి ఉన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తులు

రామగిరి, మార్చి 19: మోడల్ స్కూల్లో 6వ తరగతిలో పూర్తి సీట్లకు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు ఏప్రిల్ 27న పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గజవెల్లికి రాష్ట్రస్థాయి నాటక ప్రదర్శనలో ద్వితీయ బహుమతి

రామగిరి, మార్చి 19: పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో కోదాడలో ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో సంఘం నల్లగొండ మండల అధ్యక్షుడు గజవెల్లి సత్యం ద్వితీయ బహుమతి సాధించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన సమావేశంలో సత్యంను ఘనంగా సన్మానించారు.

ఓటరు జాబితాలలో మార్పులు, చేర్పులకు సహకరించాలి : ఆర్డీఓ అశోక్‌రెడ్డి

నీలగిరి, మార్చి19 : ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులకు రాజకీయ పార్టీలు సహకరించాలని నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి కోరారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో నల్లగొండ నియోజకవర్గం ఓటరు జాబితాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పుచ్చకాయల నర్సిరెడ్డి, బక్కా పిచ్చయ్య, పోతెపాక సాంబయ్య, తాసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కొండమల్లేపల్లి, మార్చి 19 : యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రామ్మూర్తి పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షహీద్ భగత్‌సింగ్ స్మారక యువజన ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జెల్లెఇద్ది రాములు, బుడిగ వెంకటేశ్, పొట్ల రాకేశ్, దున్నం రవి, రమావత్ రాజేశ్, ఉప్పల గణేశ్, లతానియల్ పాల్గొన్నారు.

గ్రామ పోలీస్ అధికారుల నియామకం

కట్టంగూర్, మార్చి 19 : మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎస్పీ శరత్‌చంద్ర పవర్ ఆదేశాల మేరకు మండలంలోని 22 గ్రామాలకు గ్రామ పోలీస్ అధికారులను నియమించినట్లు ఎస్ఐ ఎం.రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు గ్రామ పోలీసు అధికారులకు సహకరించాలని కోరారు.

ఎల్ఆర్ఎస్‌పై రాయితీని వినియోగించుకోవాలి : కమిషనర్

హాలియా, మార్చి 19 : 2020లో ఎల్ఆర్ఎస్ నమోదు చేసుకున్న ప్లాట్ల యజమానులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 25 శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి అన్నారు. బుధవారం ఎల్ఆర్ఎస్ చెల్లించిన వారికి 25 శాతం రాయితీకి సంబంధించిన ప్రొసీడింగ్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతిలేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పది పరీక్షలకు రెండు కేంద్రాలు

త్రిపురారం, మార్చి 19: ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ రవికుమార్ తెలిపారు. మోడల్ స్కూల్లో 173 మంది, జడ్పీహెచ్ఎస్‌లో 189మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదు : బీఆర్ఎస్వీ

చందంపేట(దేవరకొండ), మార్చి 19 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేయకపోతే భవిష్యత్ తరాలకు ప్రభుత్వవిద్య అందని ద్రాక్ష అవుతుం దని ఆవేదన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేజీ టు పీజీ గురుకుల విద్య ప్రస్తావన బడ్జెట్‌లో లేకపోవడం శోచనీయమని అన్నారు.

గణితంపై విద్యార్థులకు అవగాహన

రామగిరి, మార్చి19 : నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో బుధవారం కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాడు యూనివర్సిటీ న్యూఢిల్లీ ప్రొఫెసర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మ్యాథమెటిక్స్ కాన్సెప్ట్ ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్ స్కిల్స్, లాజికల్ రీజినింగ్ నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నకరేకల్, మార్చి 19 : కట్టంగూర్ మండలం బొల్లేపల్లి గ్రామానికి చెందిన పుట్ట నర్సింహ, లక్ష్మి దంపతుల ముగ్గురు పిల్లలు మానసిక వైకల్యంతో బాధ పడుతున్నారు. వారి చికిత్స కోసం లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం రూ.15,500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేశ్, కర్నాటి నరేశ్, బండారి నర్సింహ, శేషగిరి, గుండు విక్రమ్, పామనగుండ్ల ఉపేందర్, అబ్బగోని సాయికుమార్, రాజు పాల్గొన్నారు.

యరగండ్లపల్లిలో చెలరేగిన మంటలు

మర్రిగూడ, మార్చి 19 : మండలంలోని యరగండ్లపల్లిలో గల ముత్యాలమ్మ ఆలయ సమీపంలో బుధవారం రోడ్డు వెంట పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గ్రామంలోని ఇండ్ల వైపు మంటలు వ్యాపిస్తుండటంతో స్థానికులు డయల్ 100కు కాల్ చేశారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పి వేసింది.

ఎన్జీలో వికసిత్ భారత్ ప్రారంభం

రామగిరి, మార్చి 19: నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో బుధవారం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ ఎంజీ యూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.మద్దిలేటి, జలసాధన సమితి వ్యవస్థాపకుడు దుశ్చర్ల సత్యనారాయణతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వికసిత్ భారత్ కోఆర్డినేటర్ శివ, పర్యావరణ వేత్త మిట్టపల్లి సురేశ్‌గుప్త, ఐబీసీ నిర్వాహకురాలు ఏచూరి శైలజ, ప్రిన్సిపాల్ ఉపేందర్, జిల్లా యువజన అధికారి ప్రవీణ్ సింగ్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

'పది'లో ఉత్తమ మార్కులు సాధిస్తే సైకిళ్లు అందిస్తాం

- 'హాస్టల్ నిద్ర'లో కలెక్టర్ హనుమంతరావు

సంస్థాన్ నారాయణపురం, మార్చి 19 : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన 100 మంది విద్యార్థులకు సైకిళ్లు అందిస్తామని కలెక్టర్ హనుమంతురావు అన్నారు. హాస్టల్ నిద్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్‌లో ఎక్కువ సేపు విద్యార్థులతో గడిపితే వారి సమస్యలు పూర్తిగా తెలుస్తాయని, తద్వారా పరిష్కరించ వచ్చనే ఉద్దేశంతోనే ప్రతి నెలా హాస్టల్ నిద్ర కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ ప్రమోద్ కుమార్, ఏఎస్‌డబ్ల్యూ తారబాయి, వార్డెన్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు : ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మార్చి 19: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పీ కె.నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదు గురికి మించి గుంపులుగా ఉండరాదని పేర్కొన్నారు. ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని వివరించారు. పరిసరాల్లోని ఇంటర్నెట్, జిరాక్స్, స్టేషనరీ దుకాణాలను మూసివేయాలని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

- 67 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 11,912 మంది విద్యార్థులు
- అదనపు కలెక్టర్ రాంబాబు

సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట, మార్చి 19: ఈ నెల 21వ తేదీ నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణ కోసం 67 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 11,912 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయని, ఆలస్యమయ్యే విద్యార్థులకు 9.35 వరకు అనుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు నాలుగు బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్, 67 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సమీక్షలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఈఓ అశోక్, జిల్లా వైద్యాధికారి కోటాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ఆత్మకూర్.ఎస్: మండల పరిధిలోని నెమ్మికల్‌లో జరుగుతున్న ఉపాధి పనులను అదనపు కలెక్టర్ రాంబాబు బుధవారం పరిశీలించి మాట్లాడారు.అనంతరం స్థానిక జడ్పీ పాఠశాలలో పదో తరగతి పరీక్షల కోసం చేపడుతున్నట్లు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హసీం, ఏపీఓ ఈశ్వర్, ఈసీ మెంబర్ అరుణజ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ అంజమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

సూర్యాపేట రూరల్, మార్చి 19: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో నిలవాలని రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. స్ప్రెడ్ ఇండియా, సువెన్ ఫార్మాస్యూటికల్ సంస్థల ఆర్థిక సహకారంతో మండలంలోని బాలెంల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, నోట్ పుస్తకాలు, బూట్లు, టై, బెల్టులు, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేసి మాట్లాడారు.

నేరేడుచర్ల: మండల పరిధిలోని మేడారం జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు వాసవీ క్లబ్ ఆరోగ్య శిబిరాల జిల్లా ఇన్‌చార్జి రాచకొండ శ్రీను సహకారంతో బుధవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కందిబండ శ్రీనివాస్, కొత్త లక్ష్మణ్, గెల్లి లక్ష్మీనర్సింహారావు, ఈగ శ్రీనివాసరావు, ఎస్.వంశీ, నటరాజు, అశోక్, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పదో తరగతి విద్యార్థులకు మండల విద్యార్థికారి తల్లాడ శ్రీనివాసరావు బుధవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 175 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశామని, విద్యార్థులు భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి : ఎస్ఐ నరేశ్

గరిడేపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ నరేశ్

గరిడేపల్లి, మార్చి 19: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ చలికంటి నరేశ్ కోరారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని సంఘమిత్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ రవాణాకు పాల్పడే వారి వివరాలను 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మానవ అక్రమ రవాణా నిర్మూలనపై సంఘ బంధం అధ్యక్షులకు, వీఓఏలకు మండల కేంద్రంలో బుధవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తాసీల్దార్ లాలునాయక్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఏపీఎం అజయ్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ మురళీధర్‌రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, ఒగ్గు సోమయ్య, శ్రీలక్ష్మి, ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

పరీక్షలు ముగియడంతో విద్యార్థుల ఆనందం

సూర్యాపేట అర్బన్, మార్చి 19: గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థుల పరీక్షలు బుధవారంతో ముగిశాయి. దీంతో విద్యార్థులు హాస్టళ్ల నుంచి స్వగ్రామాలకు బయలుదేరారు. విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులతో స్థానిక బస్టాండ్ ప్రాంగణం కిటకిటలాడింది. నేడు జరుగనున్న సెకండ్ ఇయర్ పరీక్షతో ఇంటర్ పరీక్షలు పూర్తికానున్నాయి.

ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన

నేరేడుచర్ల, మార్చి 19: మండలంలోని దిర్శించర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. దిర్శించర్లను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి 368 గృహాలను మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ నాయక్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొణతం చిన్నవెంకటరెడ్డి, మాజీ జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ల సురేశ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పడిగపాటి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జిరాక్స్ సెంటర్లను మూసివేయాలి'

మునగాల, మార్చి 19: పదో తరగతి పరీక్షలు జరిగే సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని తాసీల్దార్ ఆంజనేయులు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో జిరాక్స్ సెంటర్ల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 21 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ముందస్తుగా జిరాక్స్ సెంటర్లను మూసివేస్తున్నట్లు తెలిపారు.